వంద రోజుల పాలన.. హామీల అమలు సున్నా

- పదేళ్ల నాటి హామీలనే మళ్లీ ఇచ్చిన 'గంటా'
- అప్పుడూ.. ఇప్పుడూ చేసింది శూన్యమే
- నియోజకవర్గ ప్రజల్లో అసంతృప్తి

తగరపువలస: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదు. పోనీ స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నియోజకవర్గంలో ప్రారంభించిన అభివృద్ధి పనులు ఏమైనా ఉన్నాయా అంటే అదీలేదు. అటు హామీల అమలూ లేక, ఇటు అభివృద్ధీ కానరాక ప్రజలు అసంతృప్తితో ఉన్నారు

అప్పుడు మంత్రిగా ఉన్నా..

2014 నుంచి 2019 వరకు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆయన అయిదేళ్ల పాటు మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రిగా భీమిలి నియోజకవర్గం నుంచే బాధ్యతలు చేపట్టారు. అప్పట్లో మంత్రిగా ఇచ్చిన హామీలు, వేసిన శిలాఫలకాలే ఇప్పటికీ పూర్తి కాసందున ఈ విడత కేవలం ఎమ్మెల్యేగా ఏం అభివృద్ధి పనులు చేస్తారని కూటమి నాయకులే అభిప్రాయపడుతున్నారు. కనీసం తాము సూచించిన ఉద్యోగుల బదిలీలకు కూడా గంటా సిఫారసు లేఖలు ఇచ్చినా పనులు కావడం లేదని గుండెల్లో బాధను దిగమింగుతున్నారు.



ఎస్టీపీ ప్లాంట్‌కు 2016లో వేసిన శిలాఫలకం

లోకేష్ సూపర్ సిక్స్ హామీలకు విలువేదీ?

ఈ ఏడాది ఫిబ్రవరి 17న ప్రస్తుత మంత్రి నారా లోకేష్ చిట్టివలసలో సభ ఏర్పాటు చేసి సూపర్ సిక్స్ పథకాల గురించి ఊదరగొట్టేశారు. ఆ హామీలనూ నెరవేర్చలేకపోయారని ప్రజలు నిట్టూరుస్తున్నారు.



2014 హామీలే 2024 మేనిఫెస్టోలో ..

2014 ఎన్నికలలో భీమిలి నుంచి పోటీ చేసినప్పుడు ఇచ్చిన హామీలనే మళ్లీ 2024 ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి ఓటర్లకు కరపత్రాలు పంపిణీ చేశారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో చాలావరకు పూర్తయినా..

అప్పుడు గంటా ఇచ్చిన హామీల్లో చాలావరకు పనులను తర్వాత వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చాలావరకు పూర్తి చేసింది. అలా పూర్తయి న వాటిలో చిట్టివలస జ్యూట్ కార్మికుల సమస్య, చిట్టివలస రైతుబజారు, రూ.5 కోట్లతో అనంత పద్మనాభస్వామి ఘాట్‌రోడ్డు, నియోజకవర్గంలో పలుచోట్ల బీటీరోడ్డు పనులు ఉన్నాయి.

వెక్కిరిస్తున్న శిలాఫలకాలు

2016 జూన్‌లో తగరపువలసలో ఆర్టీసీ డిపో, కాంప్లెక్స్, సూయాజ్ వాటర్ ట్రీట్‌మెంట్ నిర్మాణానికి వేసిన శిలాఫలకాలు ఇప్పటికీ వెక్కిరిస్తున్నాయి. ఇవే కాకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, కోల్డ్ స్టోరేజీలు, ఆనందపురంలో మోడ్రన్ ఫ్లవర్ మార్కెట్, ఫిష్ మార్కెట్, పాండ్రంగి వద్ద గోస్తనినదిపై వంతెన, రక్షిత తాగునీరు వంటివి 2014 ఎన్నికల సందర్భంగా కూడా వీటినే హామీగా ఇచ్చారు.



2016లో తగరపువలసలో ఆర్టీసీ డిపోనకు శిలాఫలకం ఆవిష్కరించిన అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు (ఫైల్)



బంగ్లామెట్ట వద్ద ఆర్టీసీ డిపో పేరుతో బోర్డు

శిల్పారామానికి పూర్వ వైభవమేదీ?



మధురవాడలోని శిల్పారామానికి పూర్వవైభవం తీసుకొస్తానని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మేనిఫెస్టోలో తెలిపారు. ప్రభుత్వ అధికారంలోకి వచ్చి 100రోజులు పూర్తయినా కనీసం అటుపక్కకు కూడా వెళ్లి చూడలేదు. గత ప్రభుత్వ హయాంలో పీపీపీ పద్ధతిలో అభివృద్ధికి ఇచ్చిన కల్యాణ మండపం పనులు తప్ప మరే పనులు జరగడం లేదు. కనీసం కూలిన ప్రహరీనైనా కట్టించలేదు. ఇదేనా 100రోజులు మంచి ప్రభుత్వం గొప్ప?

– పోతిన శేషుబాబు, మల్లయ్యపాలెం

అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారు



సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ప్రజలకు అనేక అబద్ధాలు చెప్పి వంద రోజులు గడిపేశారు. వాటిని కప్పి పుచ్చుకోవడానికి గత వైఎస్సార్‌సీపీ పాలనపై బురద చల్లుతున్నారు. ఇది సమంజసమేనా?

– కుంచా శివరామకృష్ణ, చిట్టివలస

సంక్షేమ పథకాలన్నీ నీరు గార్చేశారు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రజలు, వివిధ వర్గాల వారి అవసరాలు గుర్తించి గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సంక్షేమ పథకాన్నింటినీ నీరు గార్చేసింది.

– జీవీ రమణ, మాజీ కౌన్సిలర్, సంతపేట

సరకుల ధరలన్నీ పెరిగిపోయాయి



కూటమి ప్రభుత్వం ఓ పక్క సూపర్ సిక్స్ పథకాల అమలును పక్కన పెట్టేసింది మరోవైపు ధరల మోత మోగిపోతోంది. ఇటీవల నిత్యావసర సరకుల ధరలు బాగా భారీగా పెరిగిపోయాయి. ఇలా అయితే పేద, మధ్యతరగతివారు ఎలా బతుకుతారు? ధరల నియంత్రణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– జీరు వెంకటరెడ్డి, జీరుపేట

ప్రజలకు ఏం చేశారని సంబరాలు?



ఓటర్లను మభ్యపెట్టి వైఎస్సార్‌సీపీ కంటే మెరుగైన సంక్షేమ పథకాలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే చేతులు ఎత్తేసింది. రైతులు, మహిళలు, విద్యార్థులను దగా చేసి ఇప్పుడు సంబరాలు చేసుకుంటున్నారు. ప్రజలు హామీల గురించి ప్రశ్నించకుండా వైఎస్సార్‌సీపీపై బురద చల్లుతున్నారు. వైఎస్సార్‌సీపీ అమలు చేసిన సంక్షేమ పథకాలే రాష్ట్ర ప్రజలకు శ్రీరామరక్ష.

– చిల్ల సూర్యనారాయణరెడ్డి, వలందపేట

ఆర్టీసీ కాంప్లెక్స్ హామీ ఏమైంది?



2016లోనే తగరపువలసలో ఆర్టీసీ కాంప్లెక్స్, డిపో నిర్మిస్తామని శిలాఫలకం వేశారు. ప్రయాణికులు ఎండలో, వానలో వేచి ఉంటున్నారు. కనీసం వారికి బస్‌షెల్టర్లు అయినా నిర్మించండి. కూటమి ప్రభుత్వం కొరకు వేచి చూడకుండానే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు పూర్తి చేసింది. మిగిలినవి అయినా ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేయాలి.

– వెంపాద వెంకట రమణారెడ్డి, బంగ్లామెట్ట

శరన్నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ



ఉత్సవ రాట వేస్తున్న నిర్వాహకులు, అతిథులు

మధురవాడ: మధురవాడ టైలర్స్ కాలనీలోని విజయ దుర్గాదేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలకు శుక్రవారం ఉత్సవ రాట వేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు బంగారు సుబ్బారావు, లక్ష్మి, ధర్మకర్తల మండలి సభ్యులు బంగారు అశోక్, ఝాన్సీ దంపతులు, ఇతర ముత్తయిదువలతో ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు చేయించి, ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. వచ్చే నెల 3 నుంచి 12వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో పలు ఆధ్యాత్మిక, ఆరాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ధర్మకర్త చెప్పారు. కార్యక్రమంలో ఏపీ నగరాలు కార్పొరేషన్ మాజీ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, బంగారు ప్రకాశ్, వైఎస్సార్‌సీపీ కల్చరల్ వింగ్ రీజనల్ కో–ఆర్డినేటర్ వంకాయల మారుతీప్రసాద్, సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిల్లా సూరిబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మధురవాడ: చంద్రంపాలెంలో ఏర్పాటు చేసిన 33 అడుగుల భారీ వినాయక మండపం వద్ద శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు మజ్జిగ కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపం ఆవరణలో శనివారం అన్నప్రసాద వితరణ ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు

క్లుప్తంగా

గర్భిణులకు సీమంతం



వాంబేకాలనీలో గర్భిణులకు సీమంతం చేస్తున్న కార్పొరేటర్ తదితరులు

మధురవాడ: ఐసీడీఎస్ మధురవాడ సెక్టార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా 7వ వార్డు వాంబే కాలనీలో గర్భిణులకు శుక్రవారం సీమంతం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బి.హేమలత, కె.ఇందిరమ్మ, ఎస్.విజయకుమారి, జీసీహెచ్ లక్ష్మి, పి.కనకదుర్గ, కె. సన్యాసమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ పిల్లా మంగమ్మ ఈ కార్యక్రమం జరిపించారు. కుశాల్, ఇతర ప్రాజెక్టు ప్రతినిధులు కేవీ పార్వతి, జ్యోతి తదితరులు కార్యక్రమంలో మాట్లాడారు. గర్భిణులకు యోగా చేయడం వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించి, వారితో యోగాభ్యాసం చేయించారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు పద్మనాభం విద్యార్థులు



రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పద్మనాభం: అనకాపల్లిలో జరిగిన అండర్–17 జూడో విభాగంలో పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న జి.జాహ్నవి, పదో తరగతి చదువుతున్న టి.కుమార స్వామి ఈ పోటీలకు ఎంపికైన వారిలో ఉన్నారు. వారిని హెచ్‌ఎం అబ్బూరి బాలామణి, పీడీ కె.నారాయణమ్మ, ఎల్.అప్పారావు అభినందించారు.

ఉద్యోగ మేళాలో 62 మంది ఎంపిక



ఉద్యోగ మేళాలో పాల్గొన్న నిరుద్యోగులు

భీమునిపట్నం: భీమిలి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం జరిగిన ఉద్యోగ మేళాలో వివిధ ఉద్యోగాలకు 62మంది ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 244 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. ఎంపికైన వారికి త్వరలో ఆఫర్ లెటర్లు వస్తాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్లేస్‌మెంట్ అధికారి రమేష్‌నాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణ రంగంలో వాస్తు కీలకం



మాట్లాడుతున్న డా. పట్నాయక్ నారాయణ్

పీఎంపాలెం: నిర్మాణ రంగంలో వాస్తు ముఖ్య పాత్ర వహిస్తుందని, దీనిపై సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు లోతైన అవగాహన పెంపొందించుకోవాలని సీనియర్ ఫ్యాకల్టీ డా. పట్నాయక్ నారాయణ్ మూర్తి అన్నారు. స్థానిక బాబా ఇన్‌స్టిట్యూట్‌లో 'ఫ్యూజన్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ వాస్తు మోడ్రన్ ఆర్కిటెక్చర్'పై శుక్రవారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. తొమ్మిది రకాల వాస్తులు ఉన్నాయని, గోల్డెన్ రేషియా ద్వారా నిర్మాణంలో వాస్తు లోపాలు లేకుండా చేయవచ్చని విద్యార్థులకు తెలిపారు.

అన్నా క్యాంటీన్ ప్రారంభం

భీమునిపట్నం: తగరపువలస రోడ్డులోని మేదర వీధి వద్ద ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న వాణి, ఎంపీడీవో డాక్టర్ జానకి, మూడో వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ,టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కుంతీ మాధవుని సన్నిధిలో సత్యదేవుని వ్రతాలు



సత్యనారాయణస్వామి వ్రత కథను వివరిస్తున్న రాజయోగి



వ్రతాలు చేస్తున్న దంపతులు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేకంగా రూపొందించిన వేదిక వద్ద సత్యనారాయణ స్వామి ఫొటోలు ఏర్పాటు చేసి, వ్రతాలు జరిపారు. రాజయోగి బీకే మంజునాథ్ సత్యనారాయణ స్వామి వ్రత కథను చదివి వినిపించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. బ్రహ్మ కుమారీల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర నారాయణరావు దంపతులు పాల్గొన్నారు. పరిసర ప్రాంతాల నుంచే కాకుండా దూర ప్రాంతాలైన తగరపువలస, విజయనగరం నుంచి కూడా దంపతులు అధిక సంఖ్యలో వచ్చి వ్రతాలు చేసుకున్నారు.

పురుగు మందులు అధికంగా వాడొద్దు



పొలంబడి కార్యక్రమంలో అధికారులు, రైతులు

తగరపువలస: రైతులు సాగులో అవసరానికి మించి పురుగు మందులు వినియోగించవద్దని వ్యవసాయశాఖ భీమిలి సహాయ సంచాలకుడు విజయప్రసాద్ తెలిపారు. భీమిలి మండలం తాటితూరు కళ్లాల్లో శుక్రవారం జరిగిన పొలంబడి కార్యక్రమంలో మేలైన వ్యవసాయ పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. స్వల్పకాలిక అధ్యయనాలలో భాగంగా చదరపు మీటరులో పిలకలు, ఆకులు రైతులచే తొలగించే కార్యక్రమాలు నిర్వహించారు. దీనివలన పంటను కాండం తొలిచే పురుగు, ఆకు ముడత పురుగు ఆశించినా పంట దిగుబడిపై పెద్దగా ప్రభావం ఉండదన్నారు. అలాగే లింగాకర్షణ బుట్టలు, వేపనూనె, పసుపు జిగురు అట్టలు సరఫరా చేసి, వాటి ఉపయోగాలు తెలియచేశారు. కార్యక్రమంలో భీమిలి ఏవో బి.శివ కోమలి, వ్యవసాయ సిబ్బంది స్వాతి, కృపామణి, స్రవంతి, రమేష్, హరీష్, రైతులు సాడి జాంబిరెడ్డి, మోహన్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు దాటాలంటే అంధుల్లో ఆందోళన

- ప్రమాదకరంగా పరదేశిపాలెం జంక్షన్
- సిగ్నల్, సూచిక బోర్డుల ఏర్పాటుకు వినతి



పరదేశిపాలెం జంక్షన్ వద్ద ప్రమాదకర పరిస్థితుల్లో రోడ్డు దాటుతున్న అంధులు

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ పరిధిలోని పరదేశిపాలెం జంక్షన్‌లో దివ్యాంగులు, అంధులు ప్రమాదకర పరిస్థితుల్లో రోడ్డు దాటాల్సి వస్తోంది. ఇక్కడ ఓ క్రైస్తవ మిషనరీ సంస్థ దివ్యాంగులకు రోజూ మధ్యాహ్న భోజనం, ఇతర సహాయ సహకారాలు అందిస్తోంది. దీంతో ఇక్కడికి అంధులతో పాటు మూడు చక్రాల బళ్లపై దివ్యాంగులు వస్తుంటారు. ఈ జంక్షన్‌లో ట్రాఫిక్ పోలీసులు గానీ, సిగ్నల్ వ్యవస్థ గానీ లేదు. ఇది తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతం అయినందున సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ దివ్యాంగుల సంచారం ఉంటుందన్న సూచిక ఉంటే, వాహనదారులు నెమ్మదిగా వస్తారని చెబుతున్నారు. అలాగే, రహదారిపై సిగ్నల్ ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చని విజ్ఞప్తి చేస్తున్నారు.

గణపతి మండపాల వద్ద అన్న సమారాధనలు



మజ్జివలస రామాలయ వీధిలో అన్నప్రసాదం వడ్డిస్తున్న నిర్వాహకులు

తగరపువలస: వినాయక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. భీమిలి మండలం మజ్జివలస రామాలయ వీధిలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు సుమారు 4 వేల మందికి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ముద్దాడపేట వరసిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో నిర్వాహకులు భారీ అన్నసమారాధన నిర్వహించారు. జీవీఎంసీ భీమిలి జోన్ పరిధి చిల్లపేటతో పాటు కొండపేట పంప్‌హౌస్ రోడ్డులో గొల్లవీధి వద్ద మండపాలలో భారీ అన్న సంతర్పణ నిర్వహించారు. ఆనందపురం మండలం వెల్లంకి శ్రీముత్యాలమ్మ తల్లి యూత్ ఆధ్వర్యంలోనూ భారీ అన్నసమారాధన జరిగింది.

లిక్విడ్ గంజాయితో ముగ్గురి అరెస్ట్

మధురవాడ: పీఎంపాలెం ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వద్ద శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో ముగ్గురు వ్యక్తుల నుంచి పీఎం పాలెం పోలీసులు 8.5 కిలోల లిక్విడ్ గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ భరత్‌కుమార్ రాజు, పీఎం పాలెం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై నుంచి వెళ్లిపోతున్న ఒడిశాలోని కోరాపుట్‌కు చెందిన గోపాల ధద్కా, కొమ్మాదికి చెందిన గులివిందల రాజారావు, ముంచంగిపుట్‌కు చెందిన వంతల రామ్మూర్తి నుంచి గంజాయితో పాటు మూడు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిని రూరల్ తహసీల్దార్ ముందు హాజరుపరచి కేసు నమోదు చేశారు.

తీరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



తీరానికి కొట్టుకొచ్చిన మృతదేహం

భీమునిపట్నం: భీమిలి సముద్ర తీరానికి శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకు వచ్చింది. ఇక్కడ మార్లిన్‌కే రెస్టారెంట్ వెనుకభాగంలోని తీరంలో 40 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు తెలియజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ బి.సుధాకర్, ఎస్‌ఐ హరీష్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుడి చేతిపై 'రాధ' అని పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తడి-పొడి చెత్తపై అవగాహన



చెత్త విభజన గురించి వివరిస్తున్న విద్యార్థులు

తగరపువలస: తడి పొడి చెత్త విభజనపై జీవీఎంసీ ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు శుక్రవారం అవగాహన కల్పించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఇంటింటా ప్లకార్డులు పట్టుకుని ప్రచారం చేశారు. స్కూల్ కమిటీ చైర్మన్ షేక్ షర్మిల తదితరులు పాల్గొన్నారు.

జ్యూట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశమైన జ్యూట్‌మిల్లు కార్మిక సంఘాల నాయకులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లులో కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కార్మిక సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. గుజ్జు రాము నాయుడు భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమక్షంలో కార్మిక సంఘాల ప్రతినిధులు, జాయింట్ లేబర్ కమిషనర్, పీఎఫ్ అధికారులతో జరగవలసిన సమావేశం వాయిదా పడిందని తెలిపారు. తరువాత జరిగే సమావేశంలో చర్చించవలసిన అంశాలపై చర్చించారు. ఎమ్మెల్యే గంటా ద్వారా మిల్లు యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువచ్చి బకాయిల వసూళ్లకు తీర్మానం చేశారు. సమావేశంలో అల్లు బాబూరావు, కొండపు ఈశ్వరరావు, సాడి అచ్చారావు, జీరు వెంకటరెడ్డి, దల్లి అప్పలరెడ్డి, తమ్మిన కూర్మారావు, కానూరి రాంబాబు, పిట్ట సూరిబాబు, చిల్ల రాంపైడి తదితరులు పాల్గొన్నారు.

గంగిరెడ్డికి ప్రజానాట్యమండలి నివాళులు



గంగిరెడ్డి సన్యాసిరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కళాకారులు

తగరపువలస: ప్రజాకవి, రచయిత, ప్రజా నాట్యమండలి సీనియర్ నాయకుడు గంగిరెడ్డి సన్యాసిరావు కళా, సాంస్కృతిక రంగాలకు చేసిన కృషి ఎనలేనిదని కళాకారులు పేర్కొన్నారు. భీమిలి మున్సిపల్ పార్కు వద్ద శుక్రవారం నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో ఆయన చిత్రపటం వద్ద ప్రజా నాట్యమండలి ప్రతినిధులు నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు దత్తి ఈశ్వరరావు, ప్రజానాట్యమండలి ప్రతినిధులు ఎస్.అప్పలనాయుడు, బెల్లాన రామకృష్ణ, పంపాన సూర్యనారాయణ, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో ఎస్సీ కాలనీ



చీకట్లో ఎస్సీ కాలనీ

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ దరి ఎస్సీ కాలనీ నెల రోజులుగా అంధకారంలో ఉంది. ఇక్కడ వీధి లైట్లు వెలగక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదంతా కొండ ప్రాంతం కావడంతో పాటు ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో విష సర్పాలు సంచరిస్తున్నాయని, దీంతో రాత్రి సమయాల్లో బయటకు రావాలంటే భయంగా ఉంటోందని స్థానికులు తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ యాతపేటకు చెందిన గండిబోయిన దుర్గయ్య(43) అనే వ్యక్తి శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆనందపురం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు వృత్తి రీత్యా గీత కార్మికుడు. అలాగే చెట్లు కొట్టడం, కొబ్బరి బొండాలు దించడం వంటి పనులు చేస్తుంటాడు. భార్య లక్ష్మి కూలిపనులకు వెళ్తుంది. మృతుడు మద్యం ఎక్కువగా సేవిస్తుంటాడని స్థానికులు తెలిపారు. దుర్గయ్య, లక్ష్మి దంపతులకు పెళ్లయిన కుమార్తె, ఇంటర్మీడియట్ చదువుతున్న కుమారుడు ఉన్నారు. ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతికి కారణాలు తెలియవలసి ఉంది.

గీతం దూరవిద్య కోర్సుల్లో అడ్మిషన్లు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(సీడీవోఈ) ఎంఏ (ఇంగ్లిష్), బి.ఎ., బి.కాం. డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి గడువును పొడిగించినట్లు డైరెక్టర్ డా.టి.శ్రీనివాస్ తెలిపారు. ఇంటి వద్ద నుంచే దూర విద్యా విధానంలో ఈ కోర్సులను అభ్యసించే విధంగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో సూచనల మేరకు ప్రవేశం దరఖాస్తు తేదీలను పొడిగించినట్లు వెల్లడించారు. పూర్తి చేసిన దరఖాస్తులను నవంబర్ 15లోపు అందజేయాలని, ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం https://cdl.gitam.edu/Welcome.aspx ను సందర్శించాలని సూచించారు.

'జీవీఎంసీలో విలీనం వద్దు'

తగరపువలస: మారుమూల పంచాయతీలను జీవీఎంసీలో విలీనం చేయడం వలన తమకు ఒరిగేది ఏమీ లేదని ఆనందపురం మండలానికి చెందిన పలువురు మహిళలు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి శుక్రవారం తీసుకువచ్చారు. నిరక్షరాస్యులు, కూలీలు ఎక్కువగా ఉండే గ్రామ పంచాయతీలను విలీనం చేస్తే ఉపాధి హామీ వంటి పనులకు తామంతా దూరమవుతామన్నారు. తాము అన్యాయమైపోతామని పేర్కొన్నారు. దీనిపై గంటా మాట్లాడుతూ విలీన ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, దీనిపై ఆలోచించి చెబుతానని దాటవేశారు.